క్లుప్తంగా

అన్నదానం

వెదురుకుప్పం: అన్నదానం చేయడం గొప్ప విషయం అని ఉప ముఖ్యమంత్రి నారాయణ స్వామి కుమార్తె కృపాలక్ష్మి అన్నారు. గురువారం మండలంలోని పచ్చికాపల్లంలో ఎంపీపీ నాగరాణి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న అన్నదాన కార్యక్రమాన్ని ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మానవసేవే మాధవ సేవగా భావించి పెరటాసి నెల 30 రోజుల పాటు అన్నదానం చేయడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ మాజీ సభ్యుడు బండి గోవర్ధన్‌రెడ్డి, దాతలు బండి హేమసుందర్‌రెడ్డి, నాగరాణి, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

ఉదయ్‌కిరణ్‌కు పరామర్శ



స్విమ్స్‌లో ఉదయ్‌కిరణ్‌ను పరామర్శిస్తున్న డిప్యూటీ సీఎం నారాయణస్వామి

కార్వేటినగరం: మండల పరిధిలోని మునిరెడ్డి కండ్రిగ గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు ఆనంద్ కుమారుడు ఉదయ్ కిరణ్ రెండు రోజుల క్రితం తిరుపతి సమీపంలో రోడ్డు ప్రమాదానికి గురై తలకు, కాళ్లకు తీవ్ర గాయాలయ్యాయి. దీంతో అతన్ని మెరుగైన వైద్యం కోసం స్విమ్స్ ఆస్పత్రిలో బ్రెయిన్ సర్జరీ జరగడంతో సమాచారం అందుకున్న రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి కె.నారాయణస్వామి గురువారం రాత్రి స్విమ్స్ ఆస్పత్రికి వెళ్లి పరామర్శించారు. మెరుగైన వైద్యం అందించి త్వరగా కోలుకునేలా చూడాలని వైద్యులను ఆదేశించారు. మంత్రి వెంట స్విమ్స్ డైరెక్టర్ డాక్టర్ ఆర్‌వీ కుమార్, మెడికల్ సూపరింటిండెంట్ డాక్టర్ రామ్, వైద్యసిబ్బంది ఉన్నారు.

పౌష్టికాహారంతోనే ఆరోగ్యం



పోషకహార పదార్థాలను పరిశీలిస్తున్న సీడీపీఓ పద్మసునంద

వెదురుకుప్పం: ప్రతి ఒక్కరూ పౌష్టికాహారం తీసుకోవడం ద్వారా అనారోగ్య సమస్యలను నియంత్రించవచ్చని ఐసీడీఎస్ సీడీపీఓ పద్మ సునంద అన్నారు. గురువారం వెదురుకుప్పంలో నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష సందర్భంగా అంగన్‌వాడీ సిబ్బంది ఏర్పాటు చేసిన స్టాల్‌ను పరిశీలించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ పౌష్టికాహార లోపంతో రక్తహీనత, ఇతర అనారోగ్య సమస్యలు ఉత్పన్నమవుతాయని తెలిపారు. గ్రామాల్లో బాలింతలు, గర్భిణులు, పిల్లలు పోషకాహారం తీసుకునేలా అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ భారతి, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

సమయ పాలన పాటించండి



కళాశాల అభివృద్ధిపై ప్రిన్సిపల్‌తో చర్చిస్తున్న ఆర్జేడీ రవి

పెనుమూరు(కార్వేటినగరం): పెనుమూరు ప్రభుత్వ జూనియర్ కళాశాలను కడప రీజనల్ జాయింట్ డైరెక్టర్ (ఆర్జేడీ) ఎస్.రవి గురువారం ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా ఆర్జేడీ మాట్లాడుతూ నాడు–నేడు పనులను వేగవంతంగా పూర్తి చేయాలన్నారు. అలాగే త్రైమాసిక పరీక్షల పరిశీలన, కళాశాల సిబ్బంది పనితీరును అడిగి తెలుసుకున్నారు. సిబ్బంది సమయపాలన పాటించాలని, ఈ విద్యా సంవత్సరంలో మంచి ఫలితాలు వచ్చే విధంగా చూడాలని సూచించారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ బాలసుబ్రమణ్యంరాజు, సిబ్బంది పలువురు అధ్యాపకులు పాల్గొన్నారు.

ఆరోగ్య బీమాపై అవగాహన



సమావేశంలో మాట్లాడుతున్న ప్రిన్సిపల్

నగరి: ఆరోగ్య బీమాపై విద్యార్థులు అవగాహన పెంచుకోవాలని ప్రభుత్వ డిగ్రీకళాశాల ప్రిన్సిపల్ డా ఆర్.వేణుగోపాల్ అన్నారు. గురువారం కళాశాలలో కామర్స్ విభాగం, స్టార్ హెల్త్ ఇన్సూరెన్స్ కంపెనీవారు సంయుక్తంగా నిర్వహించిన వర్క్‌షాప్‌లో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేడు ప్రతి వ్యక్తి జీవితంలో ఎదుర్కొనే రెండు ముఖ్య సమస్యలు విద్య, ఆరోగ్యం అన్నారు. ఆరోగ్యాన్ని కాపాడుకునే క్రమంలో అప్పులపాలు కాకుండా చేసే ఉపాయమే ఆరోగ్య బీమా అన్నారు. అందుకే ఆరోగ్యాన్ని అందించే రంగంలో ఉపాధి అవకాశాలు పుష్కలంగా ఉన్నాయన్నారు. భారతదేశంలో ఆరోగ్య బీమా చేసుకున్నవారు కేవలం 10 శాతం మాత్రమే ఉన్నారన్నారు. ఆరోగ్య బీమా రంగంలో ఉద్యోగ అవకాశాలు విస్తృతంగా ఉన్నాయన్నారు. కార్యక్రమంలో స్టార్ హెల్త్ ప్రతినిధి మోహన్ రెడ్డి, కామర్స్ విభాగం అధిపతి భాస్కర్, డా.వేణుగోపాల్, డా.గోపి, డా.రెడ్డినాయక్, హెచ్‌ఆర్ మేనేజర్ సాయి ప్రదీప్, సేల్స్ మేనేజర్ వెంకటేష్, విద్యార్థులు పాల్గొన్నారు.

సురక్ష శిబిరాలు.. రక్షణ కవచాలు

- జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోండి
- పర్యాటక శాఖ మంత్రి ఆర్‌కే రోజా



పూడి జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరంలో మాట్లాడుతున్న మంత్రి ఆర్‌కే రోజా

పుత్తూరు రూరల్: రాష్ట్రప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాలు ప్రజల పాలిట రక్షణ కవచాలను రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, యువజన, క్రీడాశాఖ మంత్రి ఆర్‌కే రోజా అభివర్ణించారు. గురువారం వడమాలపేట మండలం పూడి గ్రామంలో జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మంత్రి రోజా, ఎంపీ రెడ్డెప్ప, తిరుపతి జిల్లా కలెక్టర్ కె.వెంకటరమణారెడ్డి హాజరై ప్రసంగించారు. మంత్రి మాట్లాడుతూ ప్రతి కుటుంబానికి నేనున్నాను అంటూ నిండు మనసుతో జగనన్న అందిస్తున్న సంక్షేమ పథకాలను ప్రతిఒక్కరూ అందిపుచ్చుకోవాలన్నారు. జగనన్న ఆరోగ్య సురక్ష పథకంలో 11 రకాల సేవలందిస్తున్నట్లు తెలిపారు. పేదవాడికి సైతం కార్పొరేట్ వైద్యం అందించాలనే దృఢ సంకల్పంతో జగనన్న ఆరోగ్య సురక్ష పథకాన్ని తీసుకొచ్చినట్లు తెలిపారు. మంచి చేసే ప్రభుత్వాన్ని మళ్లీ నిలబెట్టుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. పూడి గ్రామంలో మొత్తం 997 కుటుంబాలకు గానూ 552 మంది టోకెన్లు తీసుకొని వైద్య సేవలకు వచ్చినట్లు తెలిపారు. వైఎస్సార్ ఆరోగ్యశ్రీ పథకం ద్వారా గడచిన నాలుగేళ్లలో రూ.8,845 కోట్లతో 1.40 కోట్ల కుటుంబాలకు ఉచిత వైద్యసేవలు అందించడం జరిగిందన్నారు. అలాగే వైఎస్సార్ కంటి వెలుగు పథకం ద్వారా ఉచిత కంటి చికిత్సతో పాటు ఉచిత కంటి అద్దాల పంపిణీ కోసం రూ.13 కోట్లు కేటాయించినట్లు వివరించారు. దేశంలో ఎక్కడా లేనివిధంగా రాష్ట్రంలో 10,032 వైఎస్సార్ విలేజ్ క్లినిక్‌ను, 542 వైఎస్సార్ పట్టణ ఆరోగ్య కేంద్రాలను అందుబాటులోకి తీసుకురావడం జరిగిందని తెలిపారు. చికిత్స తర్వాత విశ్రాంతి సమయంలో వైఎస్సార్ ఆరోగ్య ఆసరా కింద రూ.1004 కోట్లతో 16.19 లక్షల మందికి లబ్ధి చేకూరినట్లు వివరించారు. అనంతరం హెల్త్‌కార్డులు, కంటి అద్దాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో నాయకులు యాదవేంద్ర రెడ్డి, కరుణాకర్‌చౌదరి, విజయలక్ష్మి, రేణుక, కుసుమ, కిరణ్, చంద్రారెడ్డి, రామిరెడ్డి, శేఖర్, మునిబాబు, సుధీర్‌రెడ్డి, నందయ్య, సురేష్‌రాజు, మునిశేఖర్, గాంధీ, డాక్టర్లు సుజిత, కిరణ్మయి, పావని, చక్రపాణి పాల్గొన్నారు.

సబ్సిడీ మోటర్ సైకిళ్ల పంపిణీ..

ఎస్సీ, ఎస్టీ వర్గాల మత్స్యకారులకు 60 శాతం సబ్సిడీతో ద్విచక్ర వాహనాలను పర్యాటక శాఖ మంత్రి ఆర్కే రోజా, ఎంపీ రెడ్డెప్ప, కలెక్టర్ కె.వెంకటరమణారెడ్డితో కలిసి పంపిణీ చేశారు. గురువారం వడమాలపేట మండలం పూడి సచివాలయం వద్ద ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఫిష్ ఆంధ్ర ఫిట్ ఆంధ్ర, ప్రధానమంత్రి మత్స్యసమృద్ధి యోజన పథకం కింద వాహనాలను లబ్ధిదారులు చంద్రయ్య, సుబ్బరాఘవులు, చిన్నబ్బలకు అందజేశారు. కార్యక్రమంలో తిరుపతి జిల్లా మత్స్యశాఖ అధికారి శ్రీనివాస్‌నాయక్, డీఎల్‌ఎస్‌సీ మెంబర్ కిరణ్‌కుమార్, బెస్త కార్పొరేషన్ డైరెక్టర్ రేణుక పాల్గొన్నారు.



వైఎస్సార్ కంటి వెలుగు కింద మహిళకు కళ్లజోడు తొడుగుతున్న మంత్రి రోజా



వైద్య కిట్లు అందుకున్న వారితో రామ్‌ప్రసాద్ రెడ్డి

నగరిలో..

నగరి: జగనన్న ఆరోగ్య సురక్ష మహత్తర పథకని మంత్రి రోజా సోదరుడు రామ్‌ప్రసాద్ రెడ్డి అన్నారు. గురువారం మండలంలోని వీకేఆర్ పురం గ్రామంలో ఏర్పాటు చేసిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. రోగులను అందిస్తున్న వైద్యసేవలను పరిశీలించారు. ఈ సందర్భంగా కంటి పరీక్షలు చేసుకున్న కళ్లద్దాలు అందజేశారు. కార్యక్రమంలో ఎంపీపీ భార్గవి, వైస్‌ఎంపీపీలు కన్నియప్ప, డిల్లీ, ఎంపీడీఓ లీలామాధవి, వైద్యాధికారి రమేష్, ఆర్బీకే చైర్మన్ బుజ్జిరెడ్డి, మండల సచివాలయ కన్వీనర్ హరి, సర్పంచ్ నందిని, ఎంపీటీసీ ఇమ్రాన్‌ఖాన్, నాయకులు పాల్గొన్నారు.

పుత్తూరులో..

పుత్తూరు రూరల్: ఆరోగ్యమే మహాభాగ్యంగా తలపెట్టిన జగనన్న ఆరోగ్య సురక్ష పథకానికి విశేష స్పందన లభిస్తోందని మున్సిపల్ చైర్మన్ ఎ.హరి తెలిపారు. గురువారం స్థానిక ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో నందిమంగళం, ఆరేటమ్మకాలనీ, ఎన్జీఓ కాలనీ, లక్ష్మీనగర్ సచివాలయాల పరిధిలో జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరం నిర్వహించారు. కార్యక్రమంలో కమిషనర్ కెఎల్‌ఎన్‌రెడ్డి, వైస్ చైర్మన్ జయప్రకాష్, కౌన్సిలర్లు, డాక్టర్లు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మున్సిపల్ చైర్మన్ హరి



కావునూరులో..

పేదలకు రక్ష..జగనన్న ఆరోగ్య సురక్ష

నిండ్ర: ఆరోగ్య ఆంధ్రప్రదేశే జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం లక్ష్యమని ఎంపీపీ దీప అన్నారు. గురువారం మండలంలోని కావునూరు గ్రామంలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. మండల పరిధిలో 15 రోజుల పాటు ఆరోగ్య సర్వే చేసి ప్రజలకు వైద్యపరీక్షలు చేస్తున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా 25 మందికి కంటి అద్దాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ శుభ, వైద్యాధికారి కల్యాణి, ఎంపీడీఓ అరుణ, తహసీల్దార్ భగవతి, సచివాలయ మండల కన్వీనర్ బాబురెడ్డి, మండల కన్వీనర్ వేణురాజు తదితరులు పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలి

వెదురుకుప్పం: మండలంలోని పచ్చికాపల్లం పరిసర ప్రాంతాల్లో అటవీ జంతువులు సంచరిస్తున్న నేపథ్యంలో ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని కార్వేటినగరం డిప్యూటీ రేంజ్ ఫారెస్ట్ అధికారి కరణ్‌సింగ్ అన్నారు. గురువారం పచ్చికాపల్లం గ్రామ సచివాలయ పరిధిలోని సిబ్బంది, గ్రామ వలంటీర్లకు రాతపూర్వకంగా నోటీసు(హెచ్చరికలు) అందజేశారు. గ్రామాల్లో ప్రజలు రాత్రి పూట వ్యవసాయ పొలాల వద్ద ఒంటరిగా ఉండకూడదని, జన సంచారం లేని ప్రాంతాల్లో ఒంటరిగా తిరగకూడదని, ఆరుబయట నిద్రించడం వంటివి చేయవద్దని సూచించారు. అలాగే రాత్రి సమయాల్లో అగ్గి మంటలు వేసుకోవాలన్నారు. ఎక్కడైనా అటవీ జంతువులు సంచరిస్తే వెంటనే తమకు 9908797000, 94416 01074కు కాల్ చేసి సమాచారం అందించాలని కోరారు. ఎవరైనా ఫేక్ మెసేజ్‌లు పెట్టి ప్రజలను భయభ్రాంతులకు గురి చేస్తే చర్యలు తీసుకుంటామన్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక



పోటీలకు ఎంపికైన విద్యార్థులతో ఉపాధ్యాయులు

నగరి: స్కూల్‌గేమ్ ఫెడరేషన్ తరఫున నిర్వహిస్తున్న పోటీల్లో భాగంగా మున్సిపల్ పరిధిలోని ఏకాంబర కుప్పం జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో జరిగిన అండర్–14 , అండర్–17 త్రోబాల్ ఎంపిక పోటీలు గురువారం నిర్వహించారు. ఉత్సాహంగా పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబరిచారు. అండర్–14 బాలికల విభాగంలో వాణిశ్రీ, సుకన్య, బాలుర విభాగంలో ఆకాష్, నందకుమార్ జిల్లా జట్టుకు ఎంపికయ్యారు. అండర్–17 బాలికల విభాగంలో ఎస్‌ఎస్ బృంద, బాలుర విభాగంలో వి.రాకేష్ జిల్లాజట్టుకు ఎంపికయ్యారు. జిల్లా జట్టుకు ఎంపికైన విద్యార్థులు రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొననున్నారు. ఎంపికైన విద్యార్థులను, పీడీలు మణి, కార్తికేయన్‌ను హెచ్‌ఎం నమశ్శివాయం, ఉపాధ్యాయులు అభినందించారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కు అందజేత



సీఎం సహాయనిధి చెక్కు అందిస్తున్న మంత్రి ఆర్‌కే రోజా

నగరి: విజయపురం మండలంలోని పోతులరాజు కండ్రిగకు చెందిన మునస్వామి కుటుంబానికి మంత్రి ఆర్‌కే రోజా రూ.1.60 లక్షల ముఖ్యమంత్రి సహాయనిధిని తన నివాస కార్యాలయం వద్ద గురువారం అందజేశారు. మునస్వామికి ఇటీవల ఊపిరితిత్తుల సంబంధిత వ్యాధి సోకడంతో తీవ్ర అస్వస్థతకు లోనయ్యారు. ఆయనకు వచ్చిన వ్యాధి ఆరోగ్యశ్రీ పరిధిలో లేకపోవడంతో ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స తీసుకున్నారు. ఖర్చు ఎక్కువ కావడంతో తనకు సాయం అందించాలంటూ మంత్రి ఆర్‌కే రోజాకు విన్నవించుకున్నారు. బాధితుడి పరిస్థితిని అర్థం చేసుకున్న మంత్రి సంబంధిత వివరాలతో ముఖ్యమంత్రి సహాయనిధికి దరఖాస్తు చేసి సాయం అందేలా చేశారు. అందుకు సంబంధించి మునస్వామికి చెక్కును అందించారు.

గృహనిర్మాణ పనుల పరిశీలన

పాలసముద్రం: ప్రభుత్వం మంజూరు చేసిన గృహనిర్మాణ పనులను వేగవంతం చేయాలని మండల విస్తరణాధికారి రమేష్ తెలిపారు. గురువారం ఆయన మండలంలోని శ్రీబొమ్మరాజుపురంలో జరుగుతున్న గృహనిర్మాణ పనులను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. అనంతరం ఆయన లబ్ధిదారులతో మాట్లాడారు. ప్రభుత్వం ఉచితంగా ఇసుక, తక్కువ ధరకే సిమెంట్, సకాలంలో బిల్లులు ఇస్తోందని తెలిపారు. కానీ గృహనిర్మాణ పనులు మాత్రం ఎక్కడవేసిన గొంగళి అక్కడే ఉన్నట్లు ఉన్నాయన్నారు. అనంతరం ఇంజినీరింగ్ అసిస్టెంట్, వలంటీర్లు ఇళ్లు మంజూరై కూడా కట్టకుండా ఉన్నవారితో మాట్లాడారు. త్వరగా ఇల్లు కట్టుకోవాలని సూచించారు.

ఆరోగ్య ఆంధ్రప్రదేశ్ సాధనే లక్ష్యం





పౌష్టికాహార స్టాల్‌ను సందర్శిస్తున్న డిప్యూటీ సీఎం నారాయణస్వామి కుమార్తె కృపాలక్ష్మి, ఎంపీపీ లత, నడవలేని స్థితిలో ఉన్న రోగికి వైద్యం అందిస్తున్న వైద్యులు

కార్వేటినగరం: రాష్ట్రాన్ని ఆరోగ్య ఆంధ్రప్రదేశ్‌గా తీర్చిదిద్దేందుకే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నిరంతరం కృషి చేస్తున్నారని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి కళత్తూరు నారాయణస్వామి కుమార్తె కృపాలక్ష్మి అన్నారు. గురువారం కొల్లాగుంట గ్రామంలో ఎంపీటీసీ శ్రీనివాసులు రెడ్డి, కోఆప్షన్ మెంబర్ పట్నం ప్రభాకర్‌రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమానికి ఎంపీపీ లతతో కలసి ఆమె ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. సీఎం జగనన్న గ్రామీణ ప్రజలకు కార్పొరేట్ స్థాయి వైద్య సేవలను అందుబాటులోకి తీసుకొచ్చారన్నారు. అనంతరం ఎంపీపీ లత మాట్లాడుతూ సంక్షేమ పథకాలతో పాటు ప్రజల సంక్షేమం గురించి అనునిత్యం ఆలోచించే సీఎం జగనన్నను వచ్చే 2024 ఎన్నికల్లో మరోసారి ముఖ్యమంత్రిని చేసుకుందామని పిలుపునిచ్చారు. అనంతరం రోగులకు కేస్‌షీట్లను అందించారు. శిబిరంలో అంగన్‌వాడీ సిబ్బంది ఏర్పాటు చేసిన పౌష్టికాహారం స్టాల్‌ను పరిశీలించి వారిని అభినందించారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి బాలాజీ, మాజీ మండల కన్వీనర్ ధనంజయవర్మ, ఎంపీడీఓ మోహన్‌మురళి, డాక్టర్ గోపీనాథ్, డాక్టర్ శృతిభాగ్యం, మాజీ సర్పంచ్ మునికృష్ణ, సింగిల్‌విండో మాజీ డైరెక్టర్ సుబ్రమణ్యం, జేసీఎస్ కన్వీనర్ పురంధర్, చందురాజు, శేషాద్రి పాల్గొన్నారు.

శ్రీరంగరాజపురంలో..

శ్రీరంగరాజపురం: మండలంలోని తయ్యూరు సచివాలయ పరిధిలోని చిన్నతయ్యూరు గ్రామంలో సర్పంచ్ టి.వరదమ్మ, ఎంపీపీ సరిత ఆధ్వర్యంలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో రాష్ట్ర వైఎస్సార్‌సీపీ మహిళ నాయకురాలు కృపాలక్ష్మి ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా ఆరోగ్య సురక్ష నోడల్ అధికారి డాక్టర్ రవిరాజు మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రతి ఇంటిని జల్లెడ పట్టి ప్రజల ఆరోగ్య సమస్యలు, అవసరాలను గుర్తించడమే కాక వాటిని పరిష్కరించేలా రాష్ట్రప్రభుత్వం చేపట్టిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం ద్వారా ప్రజలకు రూపాయి ఖర్చు లేకుండా ఉచితంగా స్పెషలిస్ట్ వైద్యుల సేవలను పొందుతున్నారని అన్నారు. ప్రతి క్యాంపులో రకాల 14 వైద్య పరీక్షలతో పాటు 172 రకాల మందులను అందుబాటులో ఉన్నాయన్నారు. అనంతరం డిప్యూటీ సీఎం నారాయణస్వామి కుమార్తె రాష్ట్ర వైఎస్సార్‌సీపీ మహిళ నాయకురాలు కృపాలక్ష్మి జన్మదినం పురస్కరించుకుని నాయకులు ఆమెను సన్మానించి అక్కడ ఏర్పాటు చేసిన భారీ కేక్‌ను రోగులతో కలసి కృపాలక్ష్మి కట్ చేశారు. అనంతరం ప్రజాప్రతినిధులు, అధికారులతో కలసి ఏర్పాటు చేసిన స్టాల్‌ను పరిశీలించారు. ఆరోగ్య సురక్ష క్యాంపునకు 688 మంది పాల్గొనగా అర్హులైన 64 మందికి కంటిఅద్దాలను అందజేసి, 22 మంది రోగులను జిల్లా ఆస్పత్రికి రెఫరల్ చేశారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ రమణప్రసాద్‌రెడ్డి, మెదవాడ సర్పంచ్ ఉమామహేశ్వరి, మండల కన్వీనర్ మణి, తహసీల్దార్ లోకనాథపిళ్లై, ఎంపీడీఓ కృష్ణయ్య, వైద్యాధికారులు డాక్టర్ బాలసుబ్రమణ్యంరెడ్డి, సందీప్‌రాజు, గౌరి, నాయకులు మాజీ సర్పంచ్ బాబు, వైఎస్సార్‌సీపీ జిల్లా యూత్ ప్రధాన కార్యదర్శి మణి, జనార్దన్, తులసిమణి, సుబ్రమణ్యం, ఆరోగ్యసిబ్బంది పాల్గొన్నారు.



గంగాధరనెల్లూరులో..

గంగాధరనెల్లూరులో..

గంగాధరనెల్లూరు: మండలంలోని కొట్రకోన ఎంపీపీ పాఠశాల ఆవరణలో గురువారం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని సర్పంచ్ సుభాషిణితో కలసి సూపరింటెండెంట్ సుధాకర్ ప్రారంభించారు. వారు మాట్లాడుతూ పేదల ఆరోగ్యం పట్ల ప్రత్యేక దృష్టి పెట్టిన ఏకైక సీఎం జగనన్నే అన్నారు. వైస్ సర్పంచ్ కుమార్ నాయుడు, నాయకులు పాల్గొన్నారు.

వెదురుకుప్పంలో..

వెదురుకుప్పం: గ్రామీణ ప్రాంతాల్లోని ప్రజలకు అందుబాటులో నాణ్యమైన వైద్య సేవలు అందించడమే జగనన్న ఆరోగ్య సురక్ష ప్రధాన ధ్యేయమని ఎంపీపీ నాగరాణి అన్నారు. గురువారం వెదురుకుప్పంలో సర్పంచ్ శిల్ప ఆధ్వర్యంలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ విజయ, ఎంపీటీసీ రాధిక, సర్పంచ్‌లు రాజేశ్వరి, గోవిందయ్య, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు పద్మనాభరెడ్డి, రాష్ట్ర సంయుక్త కార్యదర్శి బండి హేమసుందర్‌రెడ్డి, జిల్లా స్టీరింగ్ కమిటీ సభ్యుడు శివాజీ, వైద్యాధికారి ప్రవీణ, ఈఓపీఆర్డీ పురుషోత్తం, డీటీ కోమల, రామయ్య, పాల్గొన్నారు.

పవిత్రోత్సవాలు పరిసమాప్తం



స్వామివారి ఊరేగింపు నిర్వహిస్తున్న ఆలయ సిబ్బంది

పుత్తూరు రూరల్: అప్పలాయగుంటలో టీటీడీ అనుబంధ శ్రీప్రసన్న వేంకటేశ్వరస్వామి ఆలయంలో మూడు రోజుల పవిత్రోత్సవాలు గురువారం సాయంత్రం పవిత్ర విసర్జనతో వైభవంగా పరిసమాప్తమయ్యాయి. ఈసందర్భంగా ఆలయంలో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించారు. తెల్లవారుజామున సుప్రభాత సేవతో స్వామివారిని మేల్కొలిపి శుద్ధి, తోమాలసేవ, అర్చన నిర్వహించారు. ప్రధాన అర్చకులు సూర్యకుమారాచార్యులు ఆధ్వర్యంలో యాగశాలలో వైదిక కార్యక్రమాలను నిర్వహించారు. శ్రీదేవి, భూదేవి సమేత శ్రీప్రసన్న వేంకటేశ్వరస్వామి ఉత్సవమూర్తులకు స్నపనతిరుమంజనం శాస్త్రోక్తంగా నిర్వహించారు. పాలు, పెరుగు, తేనె, కొబ్బరినీళ్లు, పసుపు, చందనంతో విశేషంగా అభిషేకించి ధూపదీప నైవేద్యాలు సమర్పించారు. సాయంత్రం ఉభయ దేవేరులతో స్వామివారిని పట్టు పీతాంబరాలు, విశేష స్వర్ణాభరణాలు, పరిమళభరిత పుష్పమాలికలతో సుందరంగా అలంకరించి తిరుచ్చిపై కొలువుదీర్చి తిరువీధి ఉత్సవాన్ని నిర్వహించారు. భక్తులు అడుగడుగునా కర్పూర నీరాజనాలు సమర్పించారు. పవిత్రోత్సవాలకు చివరి రోజు కావడంతో పెద్ద సంఖ్యలో భక్తులు స్వామి వారిని దర్శించుకొని, తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

ప్రతిభను మెరుగు పరచుకోవాలి

వెదురుకుప్పం: షార్ట్ టర్మ్ ఇంటర్న్‌షిప్ ద్వారా విద్యార్థులు తమ ప్రతిభను మెరుగు పరుచుకుంటున్నట్లు ప్రిన్సిపల్ అన్నపూర్ణ శారద అన్నారు. గురువారం మండలంలోని చవటగుంట డాక్టర్ వైఎస్సార్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో విద్యార్థులకు ఇంటర్న్‌షిప్ సర్టిఫికెట్లు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కేంద్రప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న నేషనల్ ఎడ్యుకేషన్ పాలసీలో భాగంగా డిగ్రీ కళాశాలలో విద్యార్థుల చేత ఇంటర్న్‌షిప్‌లు చేయిస్తున్నట్లు తెలిపారు. సత్య ఇన్ఫోటెక్ తిరుపతి వారి సహకారంతో ఫ్రంట్–ఎండ్ వెబ్ డెవలపర్ కోర్సు పూర్తి చేసిన 40 మందికి ప్రదానం చేసినట్లు చెప్పారు. సత్య ఇన్ఫోటెక్ తిరుపతి మేనేజింగ్ డైరెక్టర్ గిరీష్‌కుమార్ రెడ్డి మాట్లాడుతూ ఈ కోర్సు చేయడం ద్వారా సాఫ్ట్‌వేర్ కంపెనీల్లో ఉద్యోగ ఉపాధి అవకాశాలు మెరుగుపడుతాయని చెప్పారు.

వైఎస్సార్‌సీపీలో చేరిన టీడీపీ నాయకులు



కుమార్‌స్వామి అధ్యక్షతన వైఎస్సార్‌సీపీలో చేరిన టీడీపీ నాయకులు

విజయపురం (నగరి): మండల పరిధిలోని కాళికాపురం గ్రామానికి చెందిన టీడీపీ నేతలు ఏ.శివమణిరెడ్డి, ఏ.వీరసింఘం, కన్నయ్య, అన్నదొరై, వెండమ్మ, కుప్పమ్మ తదితరులు మంత్రి ఆర్‌కే రోజా సోదరుడు కుమారస్వామి అధ్యక్షతన వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలో చేరారు. గురువారం వారు తిరుపతిలోని కుమార్‌స్వామిరెడ్డి నివాసానికి చేరుకున్నారు. ఈ సందర్భంగా ఆయన వారికి వైఎస్సార్‌సీపీ కండువా వేసి సాదరంగా ఆహ్వానించారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, మంత్రి ఆర్కే రోజా చేస్తున్న అభివృద్ధి, రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ ఫలాలు పార్టీలకు అతీతంగా తమకు అందాయని, అందుకే తాము వైఎస్సార్‌సీపీలో చేరుతున్నట్లు తెలిపారు. తమవంతు సాయంగా వైఎస్సార్‌సీపీ గెలుపునకు కష్టపడి పని చేస్తామని హామీ ఇచ్చారు. వారి వెంట పార్టీ నాయకులు గౌతమ్మ, పాండియన్, పి.శివమణిరెడ్డి రవి తదితరులు ఉన్నారు.

చట్టాలపై అవగాహన



న్యాయవిజ్ఞాన సదస్సులో మాట్లాడుతున్న జిల్లా సివిల్ జడ్జి కరుణకుమార్

పెనుమూరు(కార్వేటినగరం): చట్టాలపై గ్రామస్థాయిలో అవగాహన ఉండాలని జిల్లా సివిల్ జడ్జి, జిల్లా సివిల్ సర్వీస్ అథారిటీ సెక్రటరీ కరుణ్‌కుమార్ అన్నారు. గురువారం మండల పరిధిలోని గొడుగుమానుపల్లిలో నిర్వహించిన న్యాయ విజ్ఞాన సదస్సు కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ చట్టం, న్యాయం అందరికీ సమానంగా అందాలంటే గ్రామస్థాయిలో చట్టాలపై అవగాహన కల్పించాలన్నారు. ప్రజల వద్దకే వచ్చి సమస్యను తెలుసుకుని వాటి పరిష్కారం కోసం పనిచేసేదే జిల్లా న్యాయసేవాధికార సంస్థ అని చెప్పారు. ఇద్దరు వ్యక్తుల మధ్య ఆస్తి తగాదా లాంటి సమస్య వచ్చినప్పుడు కోర్టులకు పోతే కోర్టు ఫీజు చెల్లించి, డబ్బులు కట్టి లాయర్‌ను పెట్టుకుని, తీర్పు ఎప్పుడు వస్తుందో అని ఎదురు చూసే పని లేకుండా న్యాయవాధికార సంస్థలో సమస్యను లిఖిత పూర్వకంగా తెలియజేయాలన్నారు. ఈ విధంగా ఫిర్యాదు చేయడాన్ని ప్రీ లిటిగేషన్ కేసు అంటారని సూచించారు. అలాగే లీగల్ సర్వీసెస్ యాక్ట్ ద్వారా ఉచితంగా న్యాయసహాయం పొందవచ్చన్నారు. సివిల్ కోర్టులో ఇచ్చే తీర్పునకు సమానంగా లోక్‌అదాలత్ తీర్పులు ఉంటాయన్నారు. కార్యక్రమంలో మండల తహసీల్దార్ కళావతి, ఈఓపీఆర్డీ మహేశ్వర్‌రెడ్డి, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

బడి బయట పిల్లలను బడిలో చేర్పించండి



మధ్యాహ్న భోజనాన్ని పరిశీలిస్తున్న ఎంఈఓ

పాలసముద్రం: బడిబయట పిల్లలను బడిలో చేర్పించేందుకు ఉపాధ్యాయులు కృషి చేయాలని ఎంఈఓ రాజేంద్రంప్రసాద్ తెలిపారు. గురువారం ఆముదాల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో రంగాపురం, ఆముదాల, ఎస్‌ఎస్‌పురం ప్రాథమిక పాఠశాల హెచ్‌ఎం, ఉపాధ్యాయులకు సమావేశం నిర్వహించారు. ఎంఈఓ రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ బడి బయట పిల్లలను సర్వే చేసి పిల్లలను పాఠశాలల్లో చేర్పించాలని తెలిపారు. విద్యార్థులకు మధ్యాహ్న భోజనాన్ని మెనూ ప్రకారం అందించాలని హెచ్‌ఎంలకు సూచించారు. అనంతరం ఆముదాల హైస్కూల్‌లో మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించి రుచి చూశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, పాల్గొన్నారు.

దేశమ్మ ఆలయానికి కాణిపాకం రథం

నగరి: నేత్రదేవత దేశమ్మ ఆలయంలో కాణిపాకం వరసిద్ధి వినాయక స్వామి ధర్మ ప్రచార రథానికి ఘన స్వాగతం పలికారు. ఆలయానికి విచ్చేసిన రథానికి గోపూజ, ప్రత్యేక అర్చనల అనంతరం విచ్చేసిన భక్తులకు ప్రసాద వినియోగం చేశారు. ఆలయ చైర్మన్ వేణుబాబు, ఈఓ రామచంద్ర, పాల్గొన్నారు.

హక్కులతోనే ప్రజాస్వామ్య మనుగడ



మాట్లాడుతున్న అధ్యాపకులు నాగేశ్వరరావు

పుత్తూరు రూరల్: ప్రజాస్వామ్యం కలకాలం మనుగడ సాగించాలంటే ప్రాథమిక హక్కులే రక్షణ కవచమని రాజనీతి అధ్యాపకుడు ఎ.నాగేశ్వరరావు తెలిపారు. గురువారం స్థానిక ఎస్‌ఆర్‌ఎస్ ఉన్నత పాఠశాలలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల, ఎస్వీ యూనివర్సిటీ న్యాయ కళాశాల సంయుక్త ఆధ్వర్యంలో ప్రాథమిక హక్కులపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ దేశ ప్రజలకు రాజ్యాంగం ద్వారా ప్రాథమిక హక్కులు కల్పించబడ్డాయని, వాటిని పరిరక్షించాల్సిన బాధ్యత ప్రభుత్వాలపై ఉందన్నారు. విద్యార్థులకు ప్రాథమిక హక్కులపై పోటీలు నిర్వహించి, బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం సునీత, డిగ్రీ కళాశాల అధ్యాపకులు పాల్గొన్నారు.